ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 3

శనివారం 17 ఆగస్టు 2024

నంద్యాల ఏఎస్పీగా మహేంద్ర

కర్నూలు, ఆగస్టు 16: నంద్యాల జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా ఎం.మహేంద్రను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం ఏసీబీ అదనపు ఎస్పీగా పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా నంద్యాల ఏఎస్పీగా కొనసాగుతున్న ప్రవీణ్ కుమార్‌ను విశాఖపట్నం ట్రాఫిక్ అదనపు డీసీపీగా బదిలీ చేశారు. బదిలీ అయిన వారు తక్షణమే విధుల్లో చేరాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఇది శిరివెళ్ల మండలంలోని కేసీ కాలువ పరిస్థితి. లైనింగ్ ఎక్కడికక్కడ దెబ్బతినడంతో కట్ట ఎప్పుడు తెగుతుందోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఇది నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామ పరిధిలోని 72వ స్లూయిస్ సమీపంలో కేసీ కెనాల్ పరిస్థితి. జూన్‌లో కురిసిన వర్షాలకు కట్ట తెగిపోయింది. సంబంధిత అధికారులు ఇసుక సంచులతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు.

కడగండ్ల కేసీ..!

- ఎక్కడికక్కడ దెబ్బతిన్న కాలువ
- బలహీనంగా కాలువ కట్టలు
- తాత్కాలిక మరమ్మతులతో సరి
- గట్లు తెగితే పంటలు మునకే..
- ఆందోళనతో రైతులు

నంద్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాకు సాగునీటిని అందించే కేసీ కాలువ పరిస్థితి ఎంత అధ్వానంగా ఉంది అనేది ఈ రెండు ఫొటోలను చూస్తే అర్థమవుతుంది. వర్షాలు సక్రమంగా కురిసి శ్రీశైలం నిండటంతో అధికారులు కేసీ కాలువకు నీరు వదిలారు. దీంతో రైతులు ఖరీఫ్‌ను సంతోషంగా సాగు చేసుకునేందుకు సన్నద్ధమయ్యారు. అయితే కాలువ పరిస్థితిని చూస్తే ఎప్పుడు కట్ట తెగుతుందోనన్న ఆందోళనలో ఉన్నారు. పంటలు సక్రమంగా సాగు చేసుకునేందుకు చివరి వరకు నీరు అందుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



సిరివెళ్ల మండలంలో కేసీ కాలువపై అధ్వానంగా ఉన్న గేట్లు

నంద్యాల జిల్లాలో మొత్తం ఐదు లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ఇందులో 30 శాతం అంటే దాదాపు లక్షా 65 వేల ఎకరాలకు కేసీ కెనాల్ ద్వారానే నీరు అందిస్తున్నారు. రైతులకు ఈ స్థాయిలో నీటిని అందిస్తున్న కేసీ కెనాల్ పట్ల గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. ఎక్కడా కూడా దెబ్బతిన్న కట్టను పటిష్ట పరిచే ప్రయత్నం చేయటం కానీ, ధ్వంసమైన లైనింగ్‌కు మరమ్మతులు చేపట్టడం గానీ జరగలేదు. దీంతో కేసీ కాలువ పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం అధికారులు నీరు వదలటంతో కాలువకు ఎక్కడ గండి పడుతుందో.. ఎక్కడ తమ పంటలు మునుగుతాయోనన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. ఇక బండిఆత్మకూరు మండలంలోని మద్దిలేరు వాగు కింది రైతులది మరో ఇబ్బందికర పరిస్థితి. కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు నీరు అందించేందుకు మద్దిలేరు వాగుకు నీరు వదులుతారు. ఈ ఏడు కూడా అలాగే వదిలారు. బండిఆత్మకూరు మండలం ఎ. కోడూరు, నంద్యాల మండలం భీమవరం మధ్యలో ఉన్న మద్దిలేరు వంతెన చాలా చిన్నగా ఉంది. ప్రస్తుతం ప్రవహిస్తున్న నీటి కంటే మరో రెండు అడుగుల మేర నీరు వస్తే ఈ ప్రాంతంలో దాదాపు 300 ఎకరాలు నీట మునిగే ప్రమాదం ఉంది. ఈ వంతెన వెడల్పు కోసం గత వైసీపీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చి చేతులెత్తేయడంతో ఆ ప్రక్రియ అటకెక్కింది. దీంతో వంతెన దిగువన ఉన్న రైతులు పరిస్థితి అయోమయంలో పడింది. అలాగే బండిఆత్మకూరు వారధి వంతెన వద్ద కేసీ కెనాల్‌కు గతంలో పెద్ద పెద్ద గండి ఏర్పడింది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మట్టితో పూడ్చే కార్యక్రమం తప్పించి శాశ్వత పరిష్కారం చూపింది లేదు. గతంలో బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు సమీపంలో కేసీ కాలువకు గండి పడి వందలాది ఎకరాలు నీట మునిగాయి.



బండి ఆత్మకూరు భోజనం వద్ద అన్యాక్రాంత మైన కేసీ

అన్యాక్రాంతమవుతున్న కేసీ..

ఆయకట్టు రైతులకు నీరందించే కేసీ కాలువ అన్యాక్రాంతమవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బండి ఆత్మకూరు మండలం భోజనం గ్రామం నుంచి సంత జూటూరు పికప్ ఆనకట్ట వరకు కేసీ కాలువ సుమారు సుమారు రెండు కి.మీ. ఉంది. అయితే ఈ కాలువను కొంత మంది పూర్తిగా ఆక్రమించడంతో అసలు కనిపించకుండా పోయింది. నీటిని తెలుగుగంగ నుంచి గాలేరు నగరికి.. అక్కడి నుంచి పికప్ ఆనకట్ట వరకు దారి మళ్లించి కేసీకి నీరు వదులుతున్నారు. ఆక్రమించిన కాలువ కింది ఆయకట్టు రైతుల పరిస్థితి ఏమిటన్నది అధికారులు కనీసం ఆలోచించటం లేదు. దీనికితోడు లైనింగ్ లేకపోవటంతో చాలా చోట్ల మురికి నీరు కెనాల్‌లోకి వచ్చి చేరుతోంది. దీనివల్ల ప్రమాదకర రసాయనాలు పంట చేలల్లోకి చేరే ప్రమాదం ఉంది. వీటన్నింటిని అధికారులు దృష్టిలో పెట్టుకుని శాశ్వత పరిష్కారాన్ని ఆలోచించాల్సిన అవసరం ఉంది.



భీమవరం - ఎ. కోడూరు మధ్యలో మద్దిలేరు వాగు దుస్థితి

నిధులు లేకుండానే భారీగా ఖర్చు..

నిర్వహణ నిమిత్తం సాగు నీటి రంగానికి ప్రభుత్వం జిల్లాకు ప్రతి సంవత్సరం కొంత మొత్తం కేటాయిస్తోంది. ఇందులో భాగంగా వైసీపీ ప్రభుత్వం కేసీ కాలువ నిర్వహణకు కూడా నిధులు కేటాయించింది. అది కూడా నామమాత్రంగానే. 2019 నుంచి 2022 వరకు దాదాపు రూ.170 కోట్లు కేటాయించగా 2022-23 సంవత్సరానికి అసలు నిధులు కేటాయించలేదు. ఆ ఏడు నీటి తీరువా పన్నులు వసూలు చేసి కేసీ నిర్వహణ కోసం వాడుకోవాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం చెప్పింది. ఇక ఎన్నికల ఏడాది కావటంతో 2023-24 సంవత్సరానికి దాదాపు రూ.48 కోట్లు కేటాయించింది. వెరసి ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.220 కోట్లు కేటాయించింది. అయితే కేసీ అధికారులు మాత్రం గత వైసీపీ హయాంలో రూ.440 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపుతున్నారు. అదేమిటంటే మిగతా నిధుల్లో భాగంగా విడుదలైన వాటిని ఖర్చు చేశామని చెబుతున్నారు. ఒకవేళ అదే నిజమనుకుంటే.. కేసీ ఈ తీరున ఎందుకు పాడైపోయిందో అధికారులే సమాధానం చెప్పాలి.



చివరి ఆయకట్టుకు..

కేసీ కెనాల్ లైనింగ్ దెబ్బతినడంతోపాటు పూడిక పేరుకుపోవడం, పిచ్చి చెట్లు, గుర్రపు డెక్క పెరిగిపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నారు. ఎక్కడికక్కడ కేసీ ప్రధాన కాలువకు సిమెంటు లైనింగ్ దెబ్బతినడంతో సాగు నీరు భూమిలో ఇంకిపోయి నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోతోంది. ఇక కాలువ పొడవునా లైనింగ్ దెబ్బతిని గోడలు కుప్పకూలిపోవడంతోపాటు, పిచ్చి చెట్లు మొలిచిన దాఖలాలు ఉన్నాయి. దీంతో నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి, ఆయకట్టు చివరి పంటలకు నీరు అందటం లేదు. తమ చేలకు నీరందించుకునేందుకు రైతులు ప్రతి ఏడాది ఆయిల్ ఇంజన్‌లు ఏర్పాటు చేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తూనే ఉంది. ఉప కాల్వల్లో విపరీతంగా గుర్రపు డెక్క, పేరా, జమ్ముగడ్డి పెరగడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందుతుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తానికి గత వైసీపీ ప్రభుత్వం తీరుతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లా అభివృద్ధికి తోడ్పడండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్) ఆగస్టు 16: జిల్లాలో ఉండే వనరులను సమర్థవంతంగా ప్రజల కోసం వినియోగిస్తూ అభివృద్ధికి పాటుపడాలని అధికారులకు కలెక్టర్ రాజకుమారి సూచించారు. ఆ మేరకు పూర్తిస్థాయిలో నివేదికలు తయారు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047 ప్రణాళిక రూపకల్పనలో భాగంగా 5 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా, మండల కేంద్రాల్లో స్థానికంగా లభ్యమయ్యే దేశీయ ఉత్పత్తులు, వనరులను వినియోగించుకుంటూ ప్రతి ఏడాది 15 శాతం గ్రోత్ రేట్ పెరిగేలా కార్యాచరణ రూపొందించి ఈనెల 23వ తేదీలోగా సంక్షిప్త నివేదికలను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఐదు సంవత్సరాల విజన్ డ్యాక్యుమెంట్‌ను గ్రోత్‌రేట్ పెరుగుదలతో, విస్తృత ఆలోచనలు, ఆవిష్కరణలు రూపొందించాలన్నారు. జిల్లాలో 158 మందికి మైనింగ్ లీజులకు ఇస్తే పనులు చేయకపోవడానికి గల కారణాలు ఏమిటని అధికారులను ప్రశ్నించారు. మైనింగ్‌శాఖ ద్వారా రూ.315 కోట్లు వచ్చే ఆదాయాన్ని రూ.500 కోట్ల వరకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వేణుగోపాల్, మైనింగ్ శాఖ ఏడీ రామచంద్ర, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని కబ్జా చేశారు

- విడిపించకపోతే ఆత్మహత్యే శరణ్యం
- సోషల్ మీడియాలో బాధితుడి వీడియో వైరల్



సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న మహమ్మద్ హుసేన్

నంద్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే అనుచరుల నుంచి తమ భూమిని ఇప్పించకపోతే ఆత్మహత్యే శరణ్యమని నంద్యాలకు చెందిన మహమ్మద్ హుసేన్ అనే వ్యక్తి ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాలు ఇలా.. మహమ్మద్ హుసేన్‌కు నంద్యాల మండలం కానాల గ్రామంలోని సర్వే నంబరు 985లో 44 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అనుచరుడు బోయ భాస్కర్‌రెడ్డి, గన్‌మెన్ చిన్ని కృష్ణ కబ్జా చేసి బోర్డు పెట్టారు. దీంతో బాధితుడు గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలకు వచ్చినప్పుడు సమస్యను వివరించాడు. ఆయన సమస్యను పరిష్కరించాలని అప్పటి ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డికి చెప్పారు. అయితే రవిచంద్రకిశోర్‌రెడ్డి సమస్యను దాటవేసి ఆ తరువాత పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే బాధితుడు సమస్యను ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు శ్రీశైలం వచ్చినప్పుడు వివరించాడు. ఇప్పటికీ తన సమస్య పరిష్కారం కాలేదని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నాడు. లేకపోతే తన భార్య, ముగ్గురు పిల్లలకు చావే గతి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

జూడాల ర్యాలీ

- నాలుగో రోజుకు చేరిన సమ్మె

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 16: కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ మేరకు శుక్రవారం జూనియర్ డాక్టర్లు కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ చేశారు. అక్కడ మానవ హారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు అచ్యుత్, తమాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులకు రక్షణ కరువైందన్నారు. కర్నూలు జీజీహెచ్‌లో మహిళా వైద్య విద్యార్థినులకు సరైన వసతులు కూడా లేవని వాపోయారు. కలకత్తాలో యువడాక్టర్‌పై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ల సమ్మెకు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నగర కార్యదర్శి హుశేన్‌బాషా సంఘీభావం తెలిపారు. జూనియర్ డాక్టర్‌ను దారుణంగా హత్య చేయడం దుర్మార్గమైన చర్య అని ఏపీ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాసు యాదవ్ అన్నారు. ఈ మేరకు రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో గ్రామీణ వైద్యుల సంఘం అత్యవసరంగా సమావేశం నిర్వహించి ఐఎంఏ వైద్యసేవలు బంద్‌కు మద్దతు తెలిపారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కర్నూలు నగరంలోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో బంగారు చీర అలంకరణలో అమ్మవారు



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 16: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా పలు దేవాలయాల్లో, నివాసాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేక కార్యక్రమాలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి కుంకుమార్చన చేశారు. అమ్మవారి సన్నిధిలోని శ్రీచక్రానికి పూజలు నిర్వహించి ఉద్యాపన వ్రతం చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం పోయడంతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, సత్యనారాయణస్వామి, కాళికాంబ, సంజీవనగర్‌లోని రామాలయం, తదితర ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతం వేడుకలు జరిగాయి. కర్నూలు నగరం గుత్తిరోడ్డులోని సూర్యనారాయణస్వామి ఆలయంలో మహాగౌరీ అమ్మవారికి విశేష అర్చనలు చేశారు. బంగారు చీరతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో వరలక్ష్మీవ్రతం ఘనంగా సందర్భంగా ఉచిత సామూహిక వరలక్ష్మీవ్ర దేవస్థానం ఘనంగా నిర్వహించింది. ఈ వ్రతాన్ని ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రావతి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ వ్రతంలో 1,500 మంది మహిళలు పాల్గొన్నారు. వ్రతంలో పాల్గొన్న వారికి అమ్మవారి శేష వస్త్రాలుగా చీర, రవిక వస్త్రం, పూలు, గాజులు, ప్రసాదాలు, శ్రీశైలప్రభ సంచికను అందజేసి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ ఆర్.రమణమ్మ, ఏఈవో హరిదాసు, అధ్యాపక ఎం.పూర్ణానంద ఆరాధ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వ్రతం మహోత్సవాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా ఐదు ఎల్‌ఈడీ భారీ స్క్రీన్లను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.



శ్రీశైలంలో వరలక్ష్మీవ్రతం



సూర్యనారాయణ స్వామి దేవాలయంలో జరిగిన వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



వర్షపు నీటిలో తడిసిన వేరుశనగను కాపాడుకుంటున్న రైతు



వర్షపు నీటికి కొట్టుకుపోతున్న వేరుశనగను ఒడిసి పట్టుకుంటున్న రైతు



వేరుశనగ రాశుల కిందికి చేరిన వర్షపు నీరు

వర్షార్పణం

- మార్కెట్ యార్డులో వానకు కొట్టుకుపోయిన వేరుశనగ
- ప్లాట్ ఫామ్‌పై మోకాలి లోతు నీరు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- కనీస సౌకర్యాలు కల్పించని అధికారులు

ఆదోని (అగ్రికల్చర్, ఆగస్టు 16: ఆదోని పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. విక్రయానికి తీసుకొచ్చి మార్కెట్ యార్డ్ ప్లాట్ ఫామ్‌పై రాశులుగా పోసిన వేరుశనగ కాయలు తడిసిపోకుండా కాపాడుకోడానికి రైతులు అష్ట కష్టాలు పడ్డారు. మార్కెట్ కమిటీ అధికారులు నిర్లక్ష్యం వల్ల టార్పాళ్ళు దొరకక వేరుశనగ కాయలు కొట్టుకుపోయాయి. కళ్లెదుటే వాన నీళ్ల కొట్టుకుపోతుంటే వడిసి పట్టుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ప్లాట్ ఫామ్ ముందు దుకాణాల వద్ద డ్రైనేజీలు శుభ్రపరచకపోవడంతో వర్షపు నీరు ముందుకు వెళ్లక మోకాలిలోతులో ప్రవహించి ప్లాట్‌ఫామ్ మీదికి చేరుకున్నాయని కన్నీటి పర్యంతమయ్యారు. బోరు బావులు కింద సాగైన వేరుశనగ ఇప్పుడిప్పుడే చేతికందడంతో రైతులు గత ఐదు రోజులుగా భారీగా వేరుశనగ దిగుబడులను విక్రయానికి తీసుకొస్తున్నారు. శుక్రవారం 5,722 బస్తాలు వేరుశనగ విక్రయానికి వచ్చాయి. కర్ణాటక, అనంతపురం రైతులు కూడా విక్రయానికి వేరుశనగ తీసుకొని వచ్చారు. నష్టపోయిన రైతులు తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

124 బస్తాలు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి



150 కిలోమీటర్ల దూరం నుంచి మా ఆదోని మార్కెట్ కమిటీకి 124 బస్తాలు వేరుశనగ దిగుబడిని విక్రయానికి తీసుకొని వచ్చాను. వర్షం రావడంతో ప్లాట్‌ఫామ్ పైకి నీరు వచ్చి వేరుశనగ అంతా కొట్టుకుపోయింది.

-భీమన్న రైతు, ఎరిగేరి గ్రామం రాయచూరు జిల్లా

సౌకర్యాలు కల్పించకపోవడంతో నష్టం



ఇంత పెద్ద మార్కెట్ కమిటీలో రైతులు తెచ్చిన దిగుబడులకు కనీస సౌకర్యాలు రక్షణ కల్పించలేదు. దీంతో వేరుశనగ రైతులం తీవ్రంగా నష్టపోయాం. అప్పు చేసి పెట్టుబడి పెట్టి సాగు చేశాను. దిగుబడి విక్రయానికి తెస్తే నీటిపాలయ్యింది.

-భీమయ్య పెద్ద తుమ్మలం గ్రామం

పెద్దకడబూరు మండలంలో భారీ వర్షం

వరుణుడి రాకతో రైతుల్లో ఆనందం

పెద్దకడుబూరు: మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షం రైతు కళ్లల్లో ఆనందం నింపింది. ఎండిన పైరు జీవంతో మళ్లీ పురుడు పోసుకుంది. మండల పరిధిలోని కల్లుకుంట, మేకడోణ, నౌలేకల్, చిన్నకడబూరు, రంగపురం, తారాపురం, పీకలబెట్ట, గవిగట్టు గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో మిరప, పత్తి, బొప్పాయి, ఉల్లి పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. దీంతో పాటు రహదారులు వాగులు, వంకలు కూడా వర్షం నీరుతో పొంగి పొర్లాయి. మూడు రోజుల పాటు ఉక్కపోతకు శుక్రవారం కురిసిన వర్షానికి రైతులకు, మండల ప్రజలకు భారీ ఊరటనిచ్చింది.



రహదారిపైకి వర్షం నీరు రావడంతో నిలిచిపోయిన వాహనాలు

కస్తూర్బా ప్రిన్సిపాల్‌పై వేటు

విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు



కవిత, ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరు, ఆగస్టు 16: ఎమ్మిగనూరు పట్టణంలోని షైనార్టీ కాలనీలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ కవితపై జిల్లా ఉన్నతాధికారులు వేటు వేశారు. విద్యార్థినులకు సకాలంలో భోజనం అందించడంలో నిర్లక్ష్యం వంటి ఆరోపణలు రుజువు కావడంతో ఆమెను విధుల నుంచి తొలగిస్తూ డీఈవో శ్యామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్నేళ్లుగా కవిత విధుల్లో నిర్లక్ష్యం వహించడంతోపాటు విద్యార్థినులకు సకాలంలో భోజనం కూడా అందించడం లేదని ఆరోపణలు వచ్చాయి. విద్యార్థినులు ఈ విషయం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి సంఘాల నాయకుల చొరవతో పత్రికలు, మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. దీనికి స్పందించిన జిల్లా డీఈవో కార్యాలయంలో ఏడీఏ శ్యామ్యూల్‌పాల్, ఎస్ఎస్ఏ జీడీసీవో, డిప్యూటీ డీఈవోలు గతనెల 25వ తేదీన విద్యాలయానికి చేరుకొని విద్యార్థినులను కలిసి విచారించారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయి? నాణ్యమైన భోజనం సకాలంలో అందుతుందా? అనే విషయాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ ఇబ్బందులను తెలిపారు. ఓ విద్యార్థిని అయితే ఏకంగా ఉన్నతాధికారులు ఎదుట కన్నీరు మున్నీరైంది. అలాగే వంట మనుషులు, వాచ్‌మెన్, ఇతర పనులు చేస్తున్న సిబ్బందిని అధికారులు విచారించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున అధికారులు ముందు ఆందోళనకు దిగి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యాలయంలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా అధికారులు నివేదికను డీఈవో ద్వారా కలెక్టర్‌కు సమర్పించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సైతం విద్యార్థిని ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కేజీబీవీ విద్యాలయం ప్రిన్సిపాల్ కవితను విధుల నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఆర్‌టీ ఇంగ్లీష్ అధ్యాపకురాలు మాలుంబికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

జిల్లా జైలులో తనిఖీలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శేషాద్రి

కర్నూలు(లీగల్), ఆగస్టు 16: స్థానిక పంచలింగాలలోని జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆయన జైలు రికార్డులను, ఖైదీల గదులను, వంట శాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, బాలలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా ఖైదీలకు మెరుగైన ఉచిత న్యాయ సేవలు ఉన్నాయని తెలిపారు. ఆ తర్వాత వర్కూరు, గూడూరు, కల్లూరు, ఓర్వకల్లులోని కేజీబీవీ విద్యాలయాలను ఆయన తనిఖీ చేశారు.

వాకిటి శ్రీనివాసులు హత్యపై దర్యాప్తు

పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు?

పత్తికొండ, ఆగస్టు16: పత్తికొండ ప్రాంతంలో సంచలనం రేకెత్తించిన టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు హత్యకేసుపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగిన తీరు మొదలుకుని వాకిటి శ్రీనివాసులుతో విభేదాలు ఉన్న వ్యక్తుల వివరాలు, నిత్యం కలసి తిరిగే వారి వివరాలుసేకరించి వారిని స్టేషన్‌కు పిలిచి విచారిస్తున్నట్లు సమాచారం. శ్రీనివాసులు ఫోన్‌లో కాల్ డిటైల్స్‌ను కూడా పరిగణలోకి తీసుకున్నారు గ్రామానికి చెందిన ఆరుగురిని ్ర అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

పాము కాటుతో యువకుడి మృతి

తుగ్గలి, ఆగస్టు 16: పాము కాటుకు గురై శివమణి (21) అనే యువకుడు మృతి చెందినట్లు తుగ్గలి ఎస్ఐ జమీర్ తెలిపారు. శుక్రవారం పెండేకల్‌కు చెందిన శివమణి గత వారం రోజుల క్రితం ఇంట్లో నిద్రిస్తుండగా.. చేతి వేలుకు పాము కాటేయడంతో చికిత్స నిమ్మితం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించడంతో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, ఆగస్టు 16: పందిర్లపల్లె గ్రామానికి చెందినమహిళా రైతు సువర్ణ(38) అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. వేరుశనగ పంట అమ్మగా వచ్చిన డబ్బులు వడ్డీలు చెల్లించేందుకు కూడా సరిపోలేదని భార్యాభర్తలు చర్చించుకున్నారు. ఆ తర్వాత బావి దగ్గరకు వెళ్లివస్తానని చెప్పిన భార్య సువర్ణ ఎంతసేపటికి రాక పోవడంతో వెళ్ళి చూడగా పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. తల్లి కేశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాజావలి తెలిపారు. మృతురాలికి ముగ్గురు సంతానం. ఆడపిల్లల పెళ్ళి కోసం, పంటల సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక మనో వ్యథతో సువర్ణ ఆత్మహత్య చేసుకోవడం వల్ల కుటుంబంలో తీరని దుఃఖానికి లోనైంది.

ట్రిపుల్ ఐటీకి రూ.22 కోట్లు

- తాగునీటి అవసరాలకు తొలివిడతగా రూ.9.45 కోట్లు
- గత ప్రభుత్వంలో వెనక్కు వెళ్లిన నిధులు
- ఎమ్మెల్యే గౌరు చరిత చొరవతో నిధుల విడుదల



కల్లూరు, ఆగస్టు 16: నగర శివారులోని జగన్నాథగట్టు ట్రిపుల్ ఐటీ కళాశాల తాగునీటి అవసరాల కోసం రూ.22 కోట్ల నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు తొలివిడతగా రూ.9.45 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ఈ నిధులు గత వైసీపీ ప్రభుత్వంలోనే మంజూరయ్యాయి. అయితే అప్పట్లో ప్రభుత్వం, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం, పనుల్లో జాప్యం కారణంగా ఆ నిధులన్నీ వెనక్కు వెళ్లాయి. ఈ క్రమంలో నిధులను మళ్లీ తెప్పించి ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థకు వినియోగించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత చేసిన కసరత్తు మంచి ఫలితాలను ఇచ్చింది. రూ.22 కోట్లను విద్యా సంస్థ అవసరాలకు కేటాయించాలని కోరుతూ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేశ్, నారాయణ దృష్టికి ఎమ్మెల్యే గౌరు చరిత పలుమార్లు తీసుకెళ్లారు. దీంతో తొలి విడతగా రూ.9.45 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. ఈ నిధులతో మునగలపాడు నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా నీటిని ట్రిపుల్ ఐటీ కళాశాలతోపాటు కొన్ని వార్డులకు తాగునీరు అందించే లక్ష్యంతో పనులు వేగవంతం చేయనున్నట్లు గౌరు చరిత తెలిపారు. నగర పాలక సంస్థ అధికారులు ఆ దిశగా దృష్టి సారించి నాణ్యతా ప్రమాణాలతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పైప్‌లైన్ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్‌పేట, పెద్దపాడు, పందిపాడు, లక్ష్మీపురం, దిన్నెదేవరపాడు మీదుగా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ట్రిపుల్ ఐటీ తాగునీటి అవసరాల కోసం రూ.22 కోట్లతో టెండరు ప్రక్రియ పూర్తయింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ప్రత్యేక చొరవతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నిధులు కేటాయింపునకు కృషి చేయగా మొదటి విడతగా రూ.9.45 కోట్లు విడుదల కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో కల్లూరు పరిధిలోని(36, 28, 32 వార్డులు) పెద్దపాడు, పందిపాడు, లక్ష్మీపురం, దూపాడు, ముజఫర్‌నగర్ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే అవకాశం ఉన్నట్లు ఎమ్మెల్యే గౌరుచరిత స్పష్టం చేశారు.



కర్నూలు నగరంలోని ట్రిపుల్ ఐటీఎం

ఉత్సవాలకు ముస్తాబవుతున్న మంత్రాలయం

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు



మంత్రాలయం, ఆగస్టు 16: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు ప్రధాన రహదారులను అందంగా తీర్చిదిద్దుతున్నారు. బెంగుళూరు చెందిన నాగరాజు అనే భక్తుడు రూ.1.98 కోట్లతో నిర్మిస్తున్న యాగశాలను అందంగా తీర్చేదిద్దే పనులు చురుగ్గా సాగుతున్నాయి. శ్రీమఠంలో క్యూలైన్లు, శ్రీమఠంలోని ప్రాంగణం, గెస్టు హౌస్‌లు, కార్యాలయాలకు రంగులు వేసి అలంకరిస్తున్నారు.

మఠానికి విరాళాలు

రాఘవేంద్రస్వామి మఠానికి మైసూరుకు చెందిన అరుణ అనే భక్తురాలు 1.1100 కేజీల వెండి, హైదరాబాదుకు చెందిన జయరాం అనే భక్తుడు రూ.లక్ష నగదు అన్నదానానికి, బెంగుళూరు సుముఖ ఎంటర్ ప్రైజెస్ ప్రొప్రైటర్ సరోజ 154 బస్తాల బియ్యం, బళ్లారి జిల్లా కడేహల్లికి చెందిన ఎస్‌వీఎస్ సూర్యనారాయణ రాజు 20 క్వింటాళ్ల సోనమసూరు బియ్యం, కర్ణాటకలోని ఆసన్ పట్టణానికి చెందిన ఫ్రెండ్స్ గ్రూపుకు చెందిన మినీ లారీలో వివిద రకరకాల కూరగాయలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి తెలిపారు.

నేటి నుంచి ప్రసాదం కాషాయం రంగులోకి

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో నెల రోజుల నుంచి తెలుపు రంగులో ఉన్న పరిమళ ప్రసాదం శనివారం నుంచి కాషాయ రంగులోకి మారుతుంది. ఈ రంగు పరిమళ ప్రసాదం భక్తులకు అందజేయనున్నారు.

ప్రైవేటు హాస్పిటల్స్‌లో వైద్యసేవలు బంద్

అత్యవసర సేవలకు మినహాయింపు



కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 16: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ఒకరోజు వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కర్నూలు బ్రాంచ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ కె.రామచంద్ర నాయుడు, ఎస్వీ రామ్మోహన్ రెడ్డి, కోశాధికారి మాధవి శ్యామల శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు సాధారణ వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కాబట్టి 24 గంటలు ప్రజలు ఓపీ కోసం రావద్దని వారు విజ్ఞప్తి చేశారు. అత్యవసర వైద్య సేవలు కొనసాగుతాయన్నారు.

జూడాల సమ్మెతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

జూనియర్ డాక్టర్ల సమ్మె నేపథ్యంలో జిల్లాలో 14 పీహెచ్‌సీలకు చెందిన 14 మంది వైద్యులను కర్నూలు జీజీహెచ్‌కు డిప్యుటేషన్ వేస్తూ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. సమ్మె వల్ల ఇబ్బందులు పడకుండా, క్రిటికల్ కేర్, ఇతర అత్యవసర విభాగాల కోసం వైద్యులను డిప్యుటేషన్‌పై కర్నూలుకు రావాలని ఉత్తర్వులు జారీ చేశారు. నాగులాపురం, పోలకల్, సి.బెళగల్, హుసేనాపురం, కల్లూరు, గార్గేయాపురం, ఈ.తాండ్రపాడు, నన్నూరు, రామళ్లకోట, క్రిష్ణగిరి, ఉలిందకొండ, గోవర్ధనగిరి నందవరం, లద్దగిరి పీహెచ్‌సీల నుంచి వైద్యులు తక్షణమే విధుల్లో చేరాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు.

కర్నూలు జీజీహెచ్‌లో రాపిడ్ రెస్పాన్స్ టీం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

జూనియర్ డాక్టర్ల సమ్మె వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా 15 విభాగాల వైద్యులతో రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేస్తూ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ధన్వంతరీ హాల్‌లో అన్ని డిపార్టుమెంట్ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగాలైన ఏఎంసీ, క్యాజువాల్టీ, గైనిక్, పీడీయాట్రిక్, ఎస్ఐసీయూ వార్డుల్లో యుద్ధ ప్రాతిపదికన విధులు నిర్వహించాలని సంబంధిత వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రిలో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందరూ అందుబాటులో ఉండాలన్నారు. వైద్యులు, సిబ్బంది సెలవులన్నీ రద్దు చేయాలని హెచ్‌ఓడీలను ఆదేశించారు. నర్సింగ్ సిబ్బందిని కూడా అన్ని విభాగాల్లో మాన్‌పవర్‌ను పెంచాలని నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్.పి.సావిత్రిబాయిని ఆదేశించారు. ఈ సమీక్షలో వైస్ ప్రిన్సిపాల్స్ హరిచరణ్, సాయిసుధీర్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 16: బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తాలూకా పోలీసులు శుక్రవారం తెలిపారు. నంద్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు తన ఇంటి పక్కనే ఉన్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో తాలూకా అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కర్నూలు ఆగస్టు 16: నగరంలో రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆర్పీఎఫ్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా.. మృతదేహం వద్ద ఆధార్ కార్డు లభించింది. దాని ఆధారంగా మృతుని పేరు సూరిబాబుగా గుర్తించారు. ఈ విషయంపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. దీనిపై టూటౌన్ పోలీసులు ఈ కేసు తమ పరిధిలో రాదంటూ రైల్వే పోలీసులే కేసు నమోదు చేయాలని తేల్చి చెప్పారు. దీంతో ఆర్పీఎఫ్ పోలీసులు అటు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కూడా ట్రాక్ మీద సంఘటన జరిగితేనే తమ పరిధిలోకి వస్తుందని, పార్కింగ్ ఏరియాలో జరిగింది కాబట్టి టూటౌన్ పోలీసులే చూసుకోవాలని తెలిపారు. దీంతో ఎట్టకేలకు టూటౌన్ పోలీసులే కేసు దర్యాప్తు ప్రారంభించారు.

బహిరంగంగా మద్యం తాగే వారిపై కేసులు

నంద్యాల క్రైం, ఆగస్టు 16 : బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులు పెట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో నాటుసారా స్థావరాలపై విస్తృతదాడులు, ఎంవీఐ యాక్ట్ కింద 93 కేసులు నమోదు చేసి రూ.30,905 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు చేసి మూడు కేసులు నమోదు చేసి 40లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. 5డీపీఎల్ కేసులు నమోదు చేసి 18లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని, ఒక ఎన్‌డీపీఎల్ కేసు నమోదు చేసి సుమారు 14కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ మద్యంపై 6కేసులు నమోదుచేసి సుమారు 16.74లీటర్ల టెట్రా ప్యాకెట్స్, 12బీర్‌బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో బహిరంగంగా మద్యం సేవించే 23మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా దాడులు తీవ్రతరం చేశామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఒక ప్రకటనలో తెలిపారు.

తాగు నీటి బావికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 16: ఆత్మకూరు పట్టణ శివార్లలోని అగ్నిమాపక కేంద్రం పక్కనే ఉన్న తాగునీటి బావి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని 6వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు గౌస్‌ఆజం, మహెబూబ్, అబ్దుల్‌కలాం, ఎండీ ఇలియాస్, మహ్మద్ ఆలి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్నిమాపక కేంద్రం పక్కనే పట్టణానికి సరఫరా చేసే తాగునీటి బావి ఉందని, బావి చుట్టూ ఎలాంటి ఫెన్సింగ్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. ఇటీవల ఓ యువకుడు ఇదే బావిలో శవమై కనిపించాడని తెలిపారు. దీంతో ఆ నీటిని తాగేందుకు జనం ఇష్ట పడడం లేదని వివరించారు. ఇప్పటికైనా బావి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

విద్యార్థులు దేశాభివృద్ధికి పాటుపడాలి



పార్మసీ పట్టభద్రులతో కళాశాల సిబ్బంది, ముఖ్య అతిథులు

పాణ్యం, ఆగస్టు 16: ఆర్థికంగా స్థిరపడిన విద్యార్థులు దేశాభివృద్ధికి పాటుపడాలని పూనే కాలేజ్ ఆఫ్ పార్మసీ, భారతీ విద్యాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆత్మారామ్ పవార్ అన్నారు. మండలంలోని శాంతిరాం పార్మసీ కళాశాలలో శుక్రవారం జరిగిన సమవర్తన 2024 నాలుగో స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసం పూర్తి చేసి ఆర్థికంగా స్థిరపడిన విద్యార్థులు దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా జీపీఏటీ ఆలిండియా 20వ ర్యాంకు సాధించిన కె.తరుణ్‌కుమార్‌కు కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. ఎం పార్మసీ, బీ పార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాదు నైపర్ బయోలాజికల్ హెచ్‌ఓడీ డాక్టర్ చంద్ర, డీన్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌శెట్టి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 16: ప్రభుత్వ వైద్యశాలల్లో పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులతో సమానంగా ప్రభుత్వ వైద్యశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఆప్కాస్‌లో కలపాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా వేతనాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు వైద్యశాలల్లో విశ్రాంతి గదులు కేటాయించాలని, పని ఒత్తిడి తగ్గించాలని, దళారీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని అన్నారు.

రాయితీ పథకాలను వినియోగించుకోండి

ఆత్మకూరు, ఆగస్టు 16: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగునీటి పథకం (ఏపీఎంఐపీ) ద్వారా అమలు చేస్తున్న రాయితీ పథకాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి మల్లేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఐదు ఎకరాల్లో ఉన్న రైతులకు 90శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఐదు ఎకరాలు పైబడిన రైతులకు 70శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. అలాగే స్ప్రింక్లర్ పైపులు 1 నుంచి 5 ఎకరాలు ఉన్న రైతులకు 55 శాతం రాయితీ, 5 ఎకరాలు పైబడిన రైతులకు 45 శాతం రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని వెల్లడించారు.

డీఎస్పీగా యుగంధర్‌బాబు



డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న టూటౌన్ సీఐ ఇస్మాయిల్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 16: నంద్యాల డీఎస్పీగా యుగంధర్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా యుగంధర్‌బాబు నంద్యాల డీఎస్పీగా వచ్చారు. అలాగే టూటౌన్ సీఐగా ఇస్మాయిల్, త్రీటౌన్ సీఐగా సూర్యమౌళి, నంద్యాల తాలూకా అర్బన్ సీఐగా అశ్రార్ బాషా, బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ యుగంధర్‌బాబు మాట్లాడుతూ నంద్యాల పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తామని హెచ్చరించారు. ప్రజలకు న్యాయపరమైన సమస్యలు ఉంటే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకు రావాలని కోరారు.

ఎస్ఐగా విష్ణునారాయణ

వెలుగోడు, ఆగస్టు 16: వెలుగోడు ఎస్ఐగా విష్ణునారాయణ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న విష్ణునారాయణను ఉన్నతాధికారులు వెలుగోడు ఎస్ఐగా నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఈయనను కూటమి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

వస్తు నాణ్యత ప్రమాణాలను గుర్తించాలి

పాణ్యం, ఆగస్టు 16: వినియోగదారులు వస్తు నాణ్యత ప్రమాణాలను గుర్తించాలని ఆర్జీఎం ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ అన్నారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వస్తు నాణ్యత ప్రమాణాలపై విజయవాడ నాణ్యతా ప్రమాణాల సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ రామిరెడ్డి, మెంటర్ డాక్టర్ సిద్దారెడ్డి, పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు



పాములపాడులో పూజలు



మహానందిలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు





నంద్యాల, మిడుతూరులలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు



మహానందిలో పూజా ద్రవ్యాలను కోనేరులో కలుపుతున్న మహిళలు

నంద్యాల (కల్చరల్) ఆగస్టు 16: నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. సత్యనారాయణ స్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకారం, కాళికాంబ ఆలయంలో కాళిమాతకు ప్రత్యేక అలంకారం, సంజీవ నగర్ రామాలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళికాంబ ఆలయ ఈవో లక్ష్మీనారాయణ, భగవత్ సేవా సమాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహానంది, ఆగస్టు 16: శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని మహానంది క్షేత్రంలో అత్యంత వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆలయ వేదపండితులు నిర్వహించారు. ఆలయంలో ముందుగా వరలక్ష్మి అమ్మవారిని మహిళలు పూజా ద్రవ్యాలతో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో అభిషేక మంటపం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచనముతో పాటు వరలక్ష్మి వ్రతం, తోరపూజ చేసి కట్టుకొని ఒకరికొకరు వాయినాలు, తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొన్నారు. అనంతరం పూజా ద్రవ్యాలను ఆలయం ప్రాంగణంలోని కోనేరులో కలిపారు. దాతలు మహిళలకు స్వయంగా తాంబూళాలు, సౌభాగ్య ద్రవ్యాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డితోపాటు దాతలు అవ్వారి గౌరినాథ్, సరస్వతీ దంపతులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో సకల సంపదలను కలిగించి సకల అభీష్టాలను సిద్ధింప చేసే వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండల పరిధిలోని పీరుసాహేబ్ పేట గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు రవిశర్మ ఆధ్వర్యంలో దంపతులతో పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, రాజశేఖరరెడ్డి, ఎల్లారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, రఘురామి రెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: శ్రావణ మాసం ద్వాదశి శుక్రవారం రోజున శ్రీ వరలక్ష్మి అమ్మవారి వ్రతం పూజలను భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. మండలంలోని తుమ్మలూరు గ్రామంలో టీడీపీ నాయకులు జడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి దంపతులు వరలక్ష్మి వ్రతం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలోని మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరివరం, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో అర్చకులు రమేశ్ శర్మ, కీర్తి లక్ష్మణ స్వాములు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని ఆలయ పురోహితులు పురుషోత్తం శర్మ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మూల విరాట్టుకు ముందుగా అభిషేకాలు చేసి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

వెలుగోడు: పట్టణంలోని సరస్వతి శిశు మందిరం పాఠశాలలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, బాలయ్య, రాఘవరావు దంపతులు, ఆచార్య బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

కొలను భారతిలో భక్తుల సందడి

కొత్తపల్లి, ఆగస్టు 16: చదువుల తల్లి కొలువైన కొలనుభారతి పుణ్యక్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. మూల నక్షత్రం శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో క్షేత్ర ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పురోహితులు అమ్మవారికి నూతన వస్త్రాలంకరణ, కుంకుమార్చన, పుష్పార్చనలు, సహస్ర నామార్చనలు, మహా మంగళహారతులు ఇచ్చి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో 57 మంది చిన్నారులకు అక్షరాభ్యాస క్రతువులు చేయించారు. భక్తులకు ఆర్యవైశ్య సత్ర నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.





ఉయ్యాలవాడలో సామూహిక వరలక్ష్మీ వ్రతం, వెలుగోడులో పూజలు చేస్తున్న భక్తులు

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం, నిందితులను చూపుతున్న పోలీసులు

పాములపాడు, ఆగస్టు 16: అక్రమంగా తరలిస్తున్న దాదాపు 76 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పాములపాడు ఎస్ఐ సురేశ్‌కుమార్ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. నిందితలను అదుపులోకి తీసుకొని రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు డీఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవాజామున పాములపాడు నుంచి మిట్టకందాల రహదారిలో వెళ్తున్న డీసీఎం లారీ, కారును సీఎస్ డీటీ, శ్రీనివాసులు, ఎస్ఐ తనిఖీ చేశారు. దాదాపు 190 సంచుల్లో 76 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణ చేస్తున్న ఖలీల్, నూనెయూనస్, షేక్ ముర్తుజావలి, కురుకుంద గ్రామం లక్ష్మిరెడ్డి, దుద్యాల గ్రామం చాంద్‌బాషాలను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

ఎస్సార్బీసీ బ్రిడ్జి వద్ద మట్టి కోత



ఎస్సార్బీసీ బ్రిడ్జి వద్ద కోతకు గురవుతున్న మట్టి

గడివేముల, ఆగస్టు 16: మండలంలోని కొర్రపోలూరు గ్రామ సమీపంలో ఉన్న ఎస్సార్బీసీ బ్రిడ్జికి వేసిన మట్టి కోతకు గురై ప్రమాదంగా మారింది. ఎస్సార్బీసీ బ్రిడ్జిపై నుంచి కొర్రపోలూరు, సోమాపురం పొలాలకు, అలగనూరు గ్రామానికి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జి సమీపంలో ఉన్న కేసీ కెనాల్ కాలువలో చెత్తా చెదారం చేరడంతో నీరు కాలువ పైనుంచి పారి ఎస్సార్బీసీ బ్రిడ్జికి ఓ వైపు వేసిన మట్టి కట్ట కోతకు గురైంది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు కేసీ కెనాల్‌లో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. అధికారులు స్పందించి కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 16: వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఏపీ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరెడ్డి, సురేష్‌లు అన్నారు. కలకత్తాలో విధి నిర్వహణలో ఉన్న ఓ వైద్యురాలిపై సామూహిక అత్యాచారం చేసి హత్య జరిగిన ఘటనను గ్రామీణ వైద్యుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ప్లకార్డులతో వారు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు యాకోబు, రమేష్, మజీద్, నయ్యూమ్ పాల్గొన్నారు.

● నంద్యాల పట్టణంలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలను శనివారం నిలిపి వేస్తున్నట్లు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర సేవలు మినహాయించి పూర్తి స్థాయిలో నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

నందికొట్కూరు: కలకత్తా వైద్యురాలిపై జరిగిన దారుణ సంఘటనను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు ఖండించారు. శుక్రవారం పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నందికొట్కూరు గౌరవ అధ్యక్షుడు డా.రమణ, నంద్యాల జిల్లా నందికొట్కూరు గ్రామీణ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డా.ఎండీ కుమార్, డా.వనజ, డా.నిర్మల, డా.శ్రీనివాసులు, డా.మల్లయ్య, డా.ఎండీ మహ్మద్, డా.అనురాధ, డా.మీనాక్షి, డా.ఎం.ఎం.బాషా తదితరులు కలకత్తాలోని వైద్యురాలిపై జరిగిన దాడిని ఖండించారు.

ఆత్మకూరు: కలకత్తాలో ఓ మహిళా వైద్యురాలిని అత్యాచారం చేసి హత మార్చడాన్ని నిరసిస్తూ శనివారం అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఆ సంఘం ఆత్మకూరు కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గోవిందరాజులు, కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్, కోశాధికారి డాక్టర్ వంశీధర్ సింగ్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పక్షాలు మద్దతు ఇచ్చి తమ నిరసనలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అధికారులను కలిసిన టీడీపీ నాయకులు

పాములపాడు, ఆగస్టు 16: పాములపాడు మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల అధికారులను టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. శుక్రవారం వేంపెంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ గ్రామ నాయకులతో కలిసి తహసీల్దార్ సుభద్రమ్మ, ఎస్ఐ సురేశ్ కుమార్, ఎంపీడీవో గోపీక్రిష్ణలను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈమె వెంట టీడీపీ, జనసేన నాయకులు, బాషా, లెనిన్‌బాబు, రాజేష్, మొలకశేషు, సుబ్బారావు ఉన్నారు.

అందంగా తీర్చిదిద్దడం అభినందనీయం

మంత్రి ఎన్ఎండీ ఫరూక్



హిందూ శ్మశాన వాటికలో మొక్కకు నీళ్లు పోస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 16: హిందూ శ్మశాన వాటికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం అభినందనీయమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపాలిటీ హిందూ శ్మశాన వాటిక స్వర్గధామంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి ఫరూక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ హిందూ శ్మశాన వాటికను నవ నిర్మాణ సమితి అందమైన వనంలా తీర్చి దిద్దడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు డాక్టర్ మధు సూదనరావు, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, కౌన్సిలర్ శ్యాం సుందర్‌లాల్, మున్సిపల్ ఇంజనీర్లు, సమితి సభ్యులు సత్యనారాయణ, రామకృష్ణ, శేషుబాబు, శ్యాంసుందరగుప్త పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర ప్రియదర్శిని

జూపాడుబంగ్లా, ఆగస్టు 16: బాలికలు చదువుతోపాటు క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని నందికొట్కూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం జూపాడుబంగ్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న తరగతి గదులు, టాయిలెట్స్, వంటశాల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఆత్మరక్షణ భాగంగా కరాటే నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థినులతో యోగా చేయించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. బాలికల ప్రాథమిక హక్కులు, విధుల గురించి వివరించారు. సమస్యలను జిల్లా అథారిటీకి నివేదిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ యశోద, ఏఎస్ఐ మేరీజయంతి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

స్త్రీనిధి డబ్బులు చెల్లించినా చూపడం లేదు



స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం అంబమ్మకు వినతి పత్రం ఇస్తున్న పొదుపు మహిళలు

జూపాడుబంగ్లా, ఆగస్టు 16: పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న స్త్రీనిధి రుణాలు చెల్లించినా ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని ఆరుణోదయ గ్రామైక్య సంఘం పొదుపు మహిళలు శుక్రవారం ఏపీఎం అంబమ్మ, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల కిందట 11 గ్రూపుల మహిళలకు సంబంధించి రూ. లక్షల్లో గోల్‌మాల్ జరిగిందని ప్రాజెక్టు పీడీకి ఫిర్యాదు చేయడంతో శుక్రవారం గ్రూపు మహిళలను పిలిపించారు. డబ్బులు కట్టిన రశీదులు, గ్రూపుల వివరాలు, జమకాని మొత్తాన్ని చూపించి ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 16: నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు పెండిగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. సీఐటీయూ, ప్రభుత్వ ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపి ఆసుపత్రి ఆర్ఎంఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోతే ఏవిధంగా జీవనం సాగించాలని అన్నారు. వెంటనే వేతనాలు మంజూరు చేయాలని, లేని పక్షంలో సోమవారం నుంచి విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రసాద్, సరస్వతి, సునీత పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలనలో లోపాలు ఉండరాదు

నంద్యాల రూరల్, ఆగస్టు 16: దరఖాస్తుల పరిశీలనలో లోపాలు ఉండరాదని, నిర్ణీత గడువులోపు పూర్తిగా పరిష్కరించాలని తహసీల్దార్ ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయంలో పట్టణంలోని వార్డు రెవెన్యూ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. అర్జీదారులను పూర్తి స్థాయిలో పరిశీలించకుండా, లోపాలను సరిచేయకుండా అప్‌లోడ్ చేయరాదన్నారు. అర్జీదారులను తిప్పకుండా సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 16: దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కండె శ్యాం సుందర్‌లాల్, జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షుడు బింగుమళ్ల శ్యాం సుందర్‌గుప్త అన్నారు. శుక్రవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నందమూరి నగర్‌కు చెందిన 30 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ నందనం అధ్యక్షుడు రంజిత్ కుమార్, క్యాబినెట్ ట్రెజరర్ నాగరాజు, కార్యదర్శి వేణుగోపాల్ నాగేంద్ర, శ్రీధర్ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

గడివేముల, ఆగస్టు 16: రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి హేమసుందర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని పైబోగుల, వండుట్ల గ్రామాల్లో శుక్రవారం పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. పంట నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించవచ్చని అన్నారు. పంట బీమా, పంట నష్ట పరిహారం వంటి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందితో పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు

పాములపాడు, ఆగస్టు 16: తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులను సాదించాలని ఆత్మకూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఆంజనేయ అన్నారు శుక్రవారం మండలంలోని వేంపెంట గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖ అధికారి హేమలత, స్థానిక వ్యవసాయ శాఖ అధికారి ఫణీశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి సాగులో మెలకువలను రైతులకు సూచించారు.



వేంపెంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

టీడీపీతోనే పేదల సంక్షేమం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, ఆగస్టు 16: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వంద అన్న క్యాంటీన్‌లను ప్రారంభించడం హర్షణీయం అన్నారు. రూ.5కే పేదల కడుపు నింపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ పథకం పేదలకు భరోసా ఇచ్చిందని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే బీసీల సంక్షేమం సాధ్యమని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, లాలయ్య, వాసు, సిద్దప్ప, రమణయ్య, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

డోన్ డీఎస్పీకి ఇండియన్ పోలీస్ మెడల్



డీఎస్పీ శ్రీనివాసులు

డోన్, ఆగస్టు 16: డోన్ డీఎస్పీకి ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం శాఖ రాష్ట్రంలోని పలువురు పోలీసు అధికారులకు ఇండియన్ పోలీస్ మెడల్స్ పురస్కారాలను ప్రకటించింది. సీఐడీ విభాగంలో విశిష్ట సేవలందించిన డోన్ డీఎస్పీ శ్రీనివాసులుకు ఇండియన్ పోలీస్ మెడల్ దక్కింది. ఇండియన్ పోలీస్ మెడల్ దక్కడంపై డీఎస్పీ శ్రీనివాసులు సంతోషం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే కోట్ల ప్రతిభా ప్రోత్సాహకాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు..

డోన్, ఆగస్టు 16: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పైచదువులు చదువుకునేందుకు అందించే ఆర్థిక సాయం అందించాలనే సదుద్దేశంతో ఎమ్మెల్యే కోట్ల ఈ నిర్ణయం తీసుకున్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవం వేడుకల సందర్భంగా ఆయన నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బాసటగా నిలిచేందుకు ప్రతి మండలంలో రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు నగదు ప్రోత్సాహం ప్రకటించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె, ఆగస్టు 16: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సత్యప్రపూర్ణ శుక్రవారం తెలిపారు. పీజీ అర్హత కలిగి, సబ్జెక్టులో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన వారు అర్హులన్నారు. ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని, 23న ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

డోన్(రూరల్), ఆగస్టు 16: పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిలో రోగులకు, బాలింతలకు, గర్భిణులకు డోన్ వాల్మీకి సంఘం నాయకుడు పోస్టు ప్రసాద్ ఆధ్వర్యంలో పాలు, బ్రెడ్లు, రొట్టె, గుడ్లు అందజేశారు. అలాగే పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు కూడా పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో నగర శ్రీను పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

దొర్నిపాడు, ఆగస్టు 16: మండలంలోని దొర్నిపాడు ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ కె.రామ్మోహన్, ఎస్‌ఐ బి.సురేష్‌లు తాలుకా ఉత్తమ సేవా పురస్కారాన్ని స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా అందుకున్నారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతో ఈ గుర్తింపు లభించిందని విద్యుత్ ఏఈ కె.రామ్మోహన్, ఎస్‌ఐ సురేష్ వెల్లడించారు. అవార్డు గ్రహీతలకు లైన్ ఇన్‌స్పెక్టర్ కుక్కలయ్య, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగయ్య, ఏఎస్‌ఐ మౌలాలి, ప్రతాప్‌రెడ్డి, పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

కొలిమిగుండ్ల సీఐకి..

కొలిమిగుండ్ల, ఆగస్టు 16: కొలిమిగుండ్ల అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ నూతన సీఐ రమేష్‌బాబుకు ఉత్తమ సేవా పతకం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నంద్యాలలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజాకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ సీఐగా రమేష్‌బాబు విధులు నిర్వహించి, ప్రజలకు సేవలందించారు. ఈ సందర్భంగా పలువురు సీఐని అభినందించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి: సీఐ

శిరివెళ్ల, ఆగస్టు 16: రుద్రవరం, శిరివెళ్ల మండలాల్లోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు. శిరివెళ్ల సర్కిల్ సీఐగా పని చేస్తున్న చంద్రబాబు శ్రీశైలం టూ టౌన్‌కు బదిలీ కావడంతో నంద్యాల ఫ్యాక్షన్ జోన్‌లో పని చేస్తున్న వంశీధర్‌ను ఉన్నతాధికారులు శిరివెళ్ల సీఐగా బదిలీ చేశారు. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గ్రామాల్లోని అసాంఘిక కార్యకలాపాలు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అనంతరం సీఐ వంశీధర్‌ను ఎస్‌ఐ చిన్న పీరయ్య, పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

బనగానపల్లె సీఐగా కృష్ణయ్యయాదవ్

బనగానపల్లె, ఆగస్టు 16: పట్టణంలోని యూపీఎస్ పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా కృష్ణయ్యయాదవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న గంటా సుబ్బరావు బదిలీపై వెళ్లడంతో ఉన్నతాధికారులు కృష్ణయ్యయాదవ్‌ను నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలువురు సిబ్బంది, నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

కోవెలకుంట్ల, ఆగస్టు 16: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టరు హనుమంతనాయక్ అన్నారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారి మాటలు నమ్మ వద్దన్నారు. అధిక వడ్డీలకు ఆశ పడి డబ్బులను ఎవరికి పడితే వారికి ఇచ్చి ఇబ్బందులు పడకుండా ఉండాలని అన్నారు. పిల్లలు వ్యసనాలకు గురి కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

డోన్, ఆగస్టు 16: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న డోన్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాంను శుక్రవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ ఛైర్మన్ కోట్రిక హరికిషన్‌లు కమిషనర్‌కు మెమెంటో అందజేసి సన్మానించారు. అదేవిధంగా ఉత్తమ అవార్డులు అందుకున్న డీఈ రసూల్, ఆర్‌ఐ మోహన్, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ బుజ్జమ్మలను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్యాపిలి, ఆగస్టు 16: మండలంలోని చంద్రపల్లి గ్రామంలో శుక్రవారం అనాథ వృద్ధుడు మృతి చెందాడు. యాచకుడైన వృద్ధుడు నాలుగు రోజుల క్రితం వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. బస్టాండు ప్రాంతంలో కట్టపై పడుకునే వాడని తెలిపారు. రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడు తున్న వృద్ధుడికి వైద్యం చేయించిన కోలుకోలేక మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ పెద్దల ఆర్థిక సాయంతో పోలీసులు అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం







అహోబిలంలో అమృతవల్లి అమ్మవారికి పూజలు చేస్తున్న వేదపండితులు, చాగలమర్రిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న వేద పండితులు, కొలిమిగుండ్లలో..

ఆళ్లగడ్డ, ఆగస్టు 16: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా అమృతవల్లి అమ్మవారికి నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం వేదపండితులు నిర్వహించారు. అమ్మవారికి ఆలయంలో ఉత్సవం, రంగ మండపంలో ఊంజల సేవ నిర్వహించి భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. అలాగే ఆళ్లగడ్డ పట్టణంలోని ఆచారి కాలనీలో కాళికా మాత అమ్మవారికి వరలక్ష్మీవ్రతం వేదపండితులు నిర్వహించారు.

చాగలమర్రి: మండల కేంద్రంలోని భారతీ విద్యామందిరం, కన్యకాపరమేశ్వరి, వెల్లాల క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా శ్రావణలక్ష్మికి పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, రవికలు, పిండి పదార్థాలు వరలక్ష్మీదేవికి సమర్పించి పూజలు చేశారు. చెన్నకేశవ, సంజీవరాయ ఆలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీవ్రతం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నర్సయ్య, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని వాసాపురంలో వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం చేసి అర్చకులు వారణాసి గోపిశర్మ అలంకరించి వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజలు ప్రారంభించారు. పసుపు కుంకుమ గంధం పన్నీరు దీపారాధన, కుందులు అందెనెయ్యిలు, ఒత్తులు, కర్పూరం, అక్షింతలు, పూలు అరటిపండ్లు, అరటి పిలకలు, కొబ్బరికాయలు, తమలపాకులు, వక్కలు, అన్నీ వారి ముందు పెట్టారు. వరలక్ష్మి మాత మహిళలకు వరాలు ఇస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు సమక్షంలో ఆలయ వేదపండితులు వేద మంత్రోచ్ఛరణాల మధ్య వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు.

అవుకు: మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. అవుకు పట్టణంలో వెలసిన గ్రామ దేవత మూలమ్మ, వాసవీమాత ఆలయాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు పూజలు చేశారు. అలాగే గ్రామాల్లోని మహిళలు ఇళ్లల్లో వరలక్ష్మీ దేవిని అలంకరించి వ్రతాన్ని జరుపుకున్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. కొలిమిగుండ్లతో పాటు పేట్నికోట కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, బెలుం, బెలుంశింగవరం, కల్వటాల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో, గృహాల్లో ప్రజలు వ్రతాలు ఆచరించారు.



బేతంచెర్ల మండలం మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో..



రుద్రవరం మండలం వాసాపురంలో..



చాగలమర్రి భారతీ విద్యామందిరంలో..

ఉద్యోగులు సేవా భావంతో మెలగాలి: జేసీ



కోవెలకుంట్లలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

కోవెలకుంట్ల, ఆగస్టు 16: ఉద్యోగులు సేవా భావంతో మెలిగాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సూచించారు. శుక్రవారం కోవెలకుంట్ల తహసీల్దారు కార్యాలయాన్ని జేసీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే తహసీల్దారు కార్యాలయానికి సీసీ కెమెరాలు పంపిస్తామన్నారు. మండలానికి ఐదు రాక్‌లు మంజూరు చేశారని, వాటిని తెచ్చు కుని ఆ రాక్‌ల్లో రికార్డులు భద్రంగా ఉండేలా చూడాలన్నారు. కోవెలకుంట్ల తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు నారాయణస్వామి, ఆర్‌ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: జేసీ

బనగానపల్లె: అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ హెచ్చరించారు. శుక్రవారం బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా అధికారుల హాజరు శాతాన్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. అధికారులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగులతో చిన్నారులకు సమస్యలు



మాట్లాడుతున్న వైద్యురాలు దివ్య

శిరివెళ్ల, ఆగస్టు 16: నులిపురుగులతో పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యురాలు దివ్య అన్నారు. శిరివెళ్ల పీహెచ్‌సీలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ మట్టి ద్వారా వ్యాపించే వ్యాధుల్లో నులిపురుగుల వ్యాప్తి ప్రధానమైనదని అన్నారు. నులిపురుగుల నివారణకు పిల్లలు, కిశోర బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు సురక్షితమైనవని తెలిపారు. ఈ నెల 20న ఏడు సచివాలయాల పరిధిలోని 5,746 మంది పిల్లలకు, 24 మంది బడి బయట పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ రవి కిషోర్, ఎమ్‌ఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట్ల సుజాతమ్మకు చైర్మన్ పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు

డోన్(రూరల్), ఆగస్టు 16: డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఆలూరు టికెట్ కోల్పోయిన కోట్ల సుజాతమ్మకు పార్టీ మంచి పదవి ఇచ్చి న్యాయం చేస్తుందని గతంలో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ పదవిని కోట్ల సుజాతమ్మకు కేటాయించాలని కోరారు.

జిల్లాకు కోట్ల పేరు పెట్టాలి

డోన్(రూరల్), ఆగస్టు 16: నంద్యాల జిల్లాకు కోట్ల పేరు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం సంయుక్త రాష్ట్ర కార్యదర్శి ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని డోన్‌లో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో మచ్చలేని నేతగా పేరున్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి పేరును నంద్యాల జిల్లాకు పెట్టడం సముచితంగా ఉంటుందన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

బేతంచెర్ల, ఆగస్టు 16: మండలంలో మట్కా, గుట్కా, సారా విక్రయాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని బేతంచెర్ల ఎస్‌ఐ అశోక్ అన్నారు. శుక్రవారం ఆయన బేతంచెర్ల ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు.

సంజామల ఎస్‌ఐగా రమణయ్య

సంజామల, ఆగస్టు 16: సంజామల ఎస్‌ఐగా రమణయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.ఐ రమేష్ రెడ్డి వీఆర్‌కు వెళ్లడంతో చాగలమర్రి ఎస్‌ఐగా పనిచేస్తున్న రమణయ్యను సంజామల ఎస్‌ఐగా పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేస్తూ నియమించారు. నూతన ఎస్‌ఐ రమణయ్య మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చాగలమర్రి ఎస్‌ఐగా రమేష్‌రెడ్డి

చాగలమర్రి, ఆగస్టు 16: చాగలమర్రి ఎస్‌ఐగా రమేష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సంజామల ఎస్‌ఐగా పని చేసిన రమేష్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ రమణయ్య సంజామల పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను శాంతియుతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నబీసాహెబ్, పోలీసులు ఉన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు పరికరాలు మంజూరు

కొలిమిగుండ్ల, ఆగస్టు 16 : మండలంలోని వివిధ గ్రామాల విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు ప్రభుత్వం పలు పరికరాలు మంజూరు చేసినట్లు మండల ప్రభుత్వ వైద్యులు డాక్టర్ హరిచరణ్‌రెడ్డి తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలో మొత్తం 11 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయని అన్నారు. వీటికి ఎగ్జామి నేషన్ టేబుళ్లు, హైలీ స్టాండ్లు, మందులు నిల్వ చేసే మిషన్లు తదితర పరికరాలు మంజూరయ్యాయన్నారు. వీటిని ఆయా గ్రామాల హెల్త్ సెంటర్లకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ శివరాముడు

కొలిమిగుండ్ల, ఆగస్టు 16: మండలకేంద్రమైన కొలిమిగుండ్లలో తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించి తాగునీటిని పునరుద్ధరించినట్లు గ్రామసర్పంచ్ జినుగు శివరాముడు శుక్రవారం తెలిపారు. స్థానిక మసీదు వద్ద పైప్‌లైన్ లీకేజీతో చల్లా కాలనీ, నాయినిపల్లె రహదారి కాలనీల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. వెంటనే పనులు చేపట్టి తాగునీటి సరఫరా ప్రారంభించినట్లు సర్పంచ్ తెలిపారు.

ఘనంగా కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతి

డోన్, ఆగస్టు 16: డోన్ పట్టణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి 104వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనం గా నిర్వహించారు. పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ముఖ్య మంత్రిగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి చేసిన సేవలు మరులేనివని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కోట్రికే హరికిషణ్, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్య క్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, తూర్పు లిం గారెడ్డి, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్ని కోట్లకు నివాళి అర్పించారు.



డోన్‌లో కోట్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకుడు టీఈ కేశన్నగౌడు

ప్యాపిలి: పట్టణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి జయంతి వేడుకల సందర్భంగా టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో డోన్ మార్కెట్ యార్డు ఛైర్మన్ రాజా నారాయణమూర్తి, ఖాజాపీర్, చల్లా వీరాంజనేయులు, ఎస్ మధు, రాజారవి, కోదండరాము, ఎస్‌కే వలి తదితరులు పాల్గొన్నారు.



కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల: టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య అధ్యక్షతన దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి చిత్ర పటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎల్ల నాగయ్య, తిరుమలేష్ చౌదరి, అంబాపురం గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, కేవీ సుబ్బారెడ్డి, రవీంద్ర నాయక్, మధు లోకేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రూబెన్ పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



కలచట్లలో సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ప్యాపిలి, ఆగస్టు 16: మండలంలోని కలచట్ల సమీపంలోని కొండ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న నాటు సారా స్థావరాలపై శుక్రవారం సీఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. సారా స్థావరాలను ధ్వంసం చేసి 440 లీటర్ల ఊటను పారబోశారు. అలాగే 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆళ్లగడ్డ, ఆగస్టు 16: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యోగీశ్వరయ్య అన్నారు. ఏపీ ఉద్యోగుల సంఘం గుర్తింపు దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి హజరయ్య, మహిళా ఉద్యోగులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్సార్బీసీలో జలకళ

జోరుగా వరినాట్లు



ఎస్సార్బీసీలో పరివాహకంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

సంజామల, ఆగస్టు 16: ఎస్సార్బీసీలో జలకళ సంతరించుకుంది. దీంతో వరినాట్లు జోరుగా ఊపందుకున్నాయి. ఎస్సార్బీసీల పరివాహకం, పాలేగరు పరివాహకం, చెరువుల పరివాహకంలో రైతులు జోరుగా వరినాట్లు వేస్తున్నారు. ఎస్సార్బీసీ ద్వారా అవుకు రిజర్వాయర్ జలకళ సంతరించుకోవడంతో దిగువనున్న పాలేరుకు గొల్లలేరు డ్రైయిన్ ద్వారా నీరు చేరి పరివాహక రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సాధారణంగా 1100 హెక్టార్లు ఖరీఫ్‌లో వరినాట్లు వేసే రైతులు ఈ ఏడాది అత్యధిక విస్తీర్ణంలో నాట్లు వేస్తున్నారు. జూలై నెల ఆరంభంలోనే ఎస్సార్బీసీలకు నీరు చేరడంతో రైతులు ఖరీఫ్ పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు.

నక్కలదిన్నెలో ఘర్షణ

ఏడుగురిపై కేసు నమోదు

రుద్రవరం, ఆగస్టు 16: మండలంలోని నక్కలదిన్నెలో జరిగిన ఘర్షణలో శుక్రవారం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ చిన్నపీరయ్య తెలిపారు. నక్కలదిన్నె గ్రామానికి చెందిన మస్తాన్ అనే వ్యక్తి కుమారుడు అదే గ్రామానికి చెందిన లింగమూర్తిరెడ్డి గురువారం పశువులు మేపాడని మాట మాటా పెరిగి శుక్రవారం ఘర్షణకు దారి తీసింది. మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పల్లె లింగమూర్తిరెడ్డి, బాలలింగారెడ్డి, చిన్న లింగారెడ్డి, లింగేశ్వర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, నాగిరెడ్డి, చక్రధర్‌రెడ్డి అనే ఏడుగురిపై కేసు నమోదు చేశామని చెప్పారు. గాయపడ్డ మస్తాన్‌ను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ తెలిపారు.

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి

చాగలమర్రి, ఆగస్టు 16: మండలంలోని మల్లేవేముల గ్రామంలో అడవి పందుల దాడితో మొక్కజొన్న పంట దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఎకరాల్లో అడవి పందులు రాత్రి వేలలో వచ్చి పూర్తిగా ధ్వంసం చేశాయని తెలిపారు. రైతులు బాబుల్‌రెడ్డి, చంద్రబాబు, చిన్న నరసింహారెడ్డి, మాబుహుసేన్‌లకు చెందిన 20 ఎకరాల పంట నష్టం జరిగిందని విలపించారు. అధికారులు స్పందించి అడవి పందుల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

18వ విడత సామాజిక తనిఖీపై సమీక్ష

రుద్రవరం, ఆగస్టు 16 : రుద్రవరం మండలంలో 18వ విడత సామాజిక తనిఖీపై సమీక్ష నిర్వహించినట్లు రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కాంతయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహిలచారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధిహామీ పథకం పనులు పంచాయతీ రాజ్ పనులకు సంబంధించి రూ.8 కోట్లపై ప్రతి గ్రామంలో సమీక్షలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు అలాగే పించన్లపై కూడా ఆడిట్‌లాంటివి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో ప్రతాప్, పీఆర్‌ఏఈ వెంకటరాముడు, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

రుద్రవరం, ఆగస్టు 16: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను రైతులు నమోదు చేయించుకోవాలని ఏవో శ్రీకృష్ణ అన్నారు. శుక్రవారం రుద్రవరంలో పంట నమోదును పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం: రుద్రవరం మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శుక్రవారం ఇన్‌చార్జి ఏఈ రాకేశ్‌గౌడ్ తెలిపారు. మండలంలోని హరినగరం, చిత్తరేణిపల్లె, ఆలమూరు, రుద్రవరం, చిన్నకంబలూరు, యల్లావత్తుల సబ్ స్టేషన్ల పరిధిలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు రైతులు సహకరించాలని కోరారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

చాగలమర్రి, ఆగస్టు 16: చాగలమర్రిలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తెలిపారు. శుక్రవారం చాగలమర్రి ఎమ్మార్సీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలకు చెందిన 50 శాతం ఉపాధ్యాయులకు మొదటి విడత, 19న రెండో విడత 50 శాతం మందికి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరుగుతుందని అన్నారు.